సాక్షి
డా. బి ఆర్ అంబేడ్కర్ కోనసీమ
శుక్రవారం । 22 । ఆగస్టు । 2025



రూ. 1,01,116 విరాళం

అన్నవరం: సత్యదేవుని దేవస్థానంలో నిత్యాన్నదాన పథకానికి కాటూరి లక్ష్మణరావు దంపతులు (తణుకు) రూ.1,01,116 విరాళాన్ని గురువారం సమర్పించారు. దాతకు అన్నదానం బాండ్‌ను ఈఓ వీర్ల సుబ్బారావు అందజేశారు.



డిగ్రీ అడ్మిషన్లకు నోటిఫికేషన్

ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేట్ డిగ్రీ కళాశాలల్లో ప్రవేశాలకు ఆన్‌లైన్ దరఖాస్తుల ప్రక్రియ ప్రారంభమైంది.

10లో

గిరిజన విజ్ఞాన పరిరక్షణ అవసరం



భావితరాలకు గిరిజన విజ్ఞానాన్ని పరిరక్షించి అందించాల్సిన బాధ్యత అందరిపై ఉందని ఆదికవి నన్నయ యూనివర్సిటీ వీసీ ఆచార్య ఎస్.ప్రసన్నశ్రీ అన్నారు.

10లో

న్యూస్‌రీల్

ప్రభుత్వానికి మానవత్వం ఉందా?

ఎమ్మెల్సీ ఇజ్రాయిల్ ఆవేదన

అమలాపురం టౌన్: రీ సర్వే వంకతో అర్హులైన దివ్యాంగుల పింఛన్లను తొలగిస్తున్న ఈ ప్రభుత్వానికి అసలు మానవత్వం అనేది ఉందా అని ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్ ప్రశ్నించారు. తక్షణమే తొలగించిన పింఛన్లను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. అమలాపురంలో గురువారం ఆయన 'సాక్షి'తో మాట్లాడారు. రీ సర్వే పేరుతో సదరం ద్వారా దివ్యాంగ శాతాన్ని తగ్గిస్తూ పింఛన్ల తొలగింపునకు కూటమి ప్రభుత్వం అడ్డదారుల్లో వెళుతోందన్నారు. మంచి ప్రభుత్వం, మనసున్న ప్రభుత్వమని గొప్పలు చెప్పుకొనే కూటమి ప్రభుత్వం.. రాష్ట్రవ్యాప్తంగా లక్షలాది పింఛన్లు తొలగించిందన్నారు. గత ప్రభుత్వం ఏటేటా పింఛన్లను పెంచుకుంటూ వెళితే, ఈ ప్రభుత్వం ఏటా పింఛన్లను తగ్గిస్తోందని దుయ్యబట్టారు. దివ్యాంగుల పింఛన్లు తొలగించి, వారి మనోధైర్యాన్ని ప్రభుత్వం గట్టి దెబ్బతీస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. దివ్యాంగుల జీవనోపాధిని చిదిమేసిందన్నారు. ఈ అడ్డగోలు ప్రయత్నాలను విరమించుకోకపోతే ఉద్యమిస్తామని హెచ్చరించారు.

పింఛన్ల కోత చంద్రబాబుకు కొత్తేమీ కాదు

సీపీఎం జిల్లా కన్వీనర్ వెంకటేశ్వరరావు

అమలాపురం టౌన్: వెరిఫికేషన్ పేరుతో అర్హులైన దివ్యాంగుల పింఛన్లు తొలగించడం బాధాకరమని సీపీఎం జిల్లా కన్వీనర్ కారెం వెంకటేశ్వరరావు ఆవేదన వ్యక్తం చేశారు. సంక్షేమ పథకాల్లో కోత విధించడం ముఖ్యమంత్రి చంద్రబాబుకు కొత్తేమీ కాదని విమర్శించారు. స్థానిక జిల్లా సీపీఎం కార్యాలయంలో గురువారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పింఛన్లను ఏరివేసి ఆర్థికభారాన్ని దించుకునే కుయుక్తుల్లో కూటమి ప్రభుత్వం ఉందన్నారు. సాధ్యం కాని హామీలిచ్చి, అధికారం చేపట్టాక ఏరు దాటి తెప్ప తగలేసిన చందంగా చంద్రబాబుకు ప్రతి ఎన్నికల్లో అలవాటైపోయిందన్నారు. మంచానికే పరిమితమైన 90 శాతం దివ్యాంగులైన వారికి రూ.15 వేల పింఛను తొలగిస్తే, ఆ పేద కుటుంబాలు ఏమైపోతాయని ప్రశ్నించారు. రాష్ట్రవ్యాప్తంగా లక్షకు పైగా కుటుంబాలు రోడ్డున పడ్డాయని ఆందోళన వ్యక్తం చేశారు. తొలగించిన పింఛన్లను తక్షణం పునరుద్ధరించకపోతే ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు.

ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

రాయవరం: నైపుణ్య పథకంలో భాగంగా జిల్లాలోని నిరుద్యోగుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు కాకినాడ ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణా సంస్థ ప్రిన్సిపాల్ ఎం.వేణుగోపాల వర్మ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. వివిధ కోర్సుల్లో సెప్టెంబర్ నుంచి మూడు నెలల పాటు ఉచిత శిక్షణ ఇస్తారని చెప్పారు. అసిస్టెంట్ ఎలక్ట్రీషియన్, ఫీల్డ్ టెక్నీషియన్, ఎయిర్ కండిషనింగ్ కోర్సుల్లో ఉచిత శిక్షణ ఇస్తారని తెలిపారు. అర్హులైన 16–45 ఏళ్ల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఎస్ఎస్‌సీ, ఇంటర్ జాబితా, ఆధార్, సెల్ నంబరు, మెయిల్ ఐడీ వివరాలను పొందుపర్చాలన్నారు. సెప్టెంబర్ ఒకటి సాయంత్రంలోగా కాకినాడ ప్రభుత్వ ఐటీఐలో దరఖాస్తు అందజేయాలన్నారు. వివరాలకు 87907 98431, 85008 85866 నంబర్లలో సంప్రదించవచ్చన్నారు.

ప్రమాద ఘంటికలు



ముక్తేశ్వరం-అయినవిల్లిలంక మధ్య ఎదురుబిడెం కాజ్‌వే మునగడంతో లంక ప్రజల అవస్థలు



పి.గన్నవరం అక్విడెక్టు వద్ద వరద ఉధృతి

- గంటగంటకూ పెరుగుతున్న గోదావరి వరద
- లంకవాసుల్లో ఆందోళన
- చుట్టుముడుతున్న ముంపు
- నీట మునుగుతున్న కాజ్‌వేలు
- తాత్కాలికంగా పడవల ఏర్పాటు
- లోతట్టు ప్రాంతాల్లోకి చేరుతున్న నీరు
- ధవళేశ్వరం బ్యారేజీ నుంచి సాయంత్రం 8 గంటలకు 11.85 లక్షల క్యూసెక్కుల విడుదల
- ఎగువన మరింత పెరుగుతున్న వరద

సాక్షి, అమలాపురం: ఆగస్టులో నెలలో గోదావరికి రావాల్సి వరద రానే వచ్చింది. ఇప్పటి వరకు రెండు మూడు సార్లు కొద్దిపాటి వరదకే పరిమితమైన గోదావరి.. రెండు రోజులుగా క్రమంగా పెరుగుతూ ఉగ్రరూపాన్ని సంతరించుకుంటోంది. ధవళేశ్వరం బ్యారేజీ వద్ద రెండో ప్రమాద హెచ్చరికకు చేరుకుంటున్న వరద.. కోనసీమ జిల్లాలోని లంక గ్రామాలపై గురువారం రాత్రి నుంచి తన ప్రతాపాన్ని చూపుతోంది. లంక గ్రామాలకు వెళ్లే కాజ్‌వేలు నీట మునుగుతున్నాయి. బాహ్య ప్రపంచంతో సంబంధాలు తెగిపోతుండడంతో పడవలను ఆశ్రయిస్తున్నారు.

పెరిగిన వరద

ధవళేశ్వరం బ్యారేజ్ నుంచి ఉదయం ఐదు గంటల సమయానికి 9,62,647 క్యూసెక్కుల జలాలను దిగువకు విడుదల చేయగా, రాత్రి ఎనిమిది గంటల సమయంలో 11,85,026 క్యూసెక్కుల నీటిని వదిలారు. ప్రస్తుతం మొదటి ప్రమాద హెచ్చరిక ఉండగా, అర్ధ రాత్రి సమయంలో రెండో ప్రమాద హెచ్చరిక జారీ చేయనున్నారు. వరద 14 లక్షల నుంచి 15 లక్షల క్యూసెక్కుల వరకు పెరుగుతోందని అంచనా. దీనితో దిగువన ఉన్న కోనసీమ లంక వాసుల్లో వరద కష్టాలు మొదలయ్యాయి. పి.గన్నవరం, అయినవిల్లి మండలాల్లో ఇప్పటికే కొన్ని కాజ్‌వేలపై వరద నీరు చేరింది. దీంతో పడవలు ఏర్పాటు చేశారు. ముమ్మిడివరం, మామిడికుదురు, మలికిపురం మండలాల్లో మరికొన్ని కాజ్‌వేలు కూడా నీట మునగనున్నాయి. ఇటువంటి పడవలు ఏర్పాటు చేసేందుకు అధికారులు సిద్ధమవుతున్నారు. పి.గన్నవరం, దానిని ఆనుకుని ఉన్న పశ్చిమ గోదావరి జిల్లా పరిధిలోని లంక గ్రామాలకూ పడవలు ఏర్పాటు చేశారు. పడవలు దాటేందుకు విద్యార్థులు, వృద్ధులు, దివ్యాంగులు ఇబ్బందులు పడుతున్నారు. లంకల్లోని వ్యవసాయ ఉత్పత్తులను బయటకు తరలించేందుకు రైతులు అవస్థలు పడుతున్నారు. గోదావరి నదీపాయల మధ్యలో ఉన్న లంకలు వరద నీట మునగడంతో పాడి రైతులు పశువులను ఏటిగట్లపైకి తరలించారు. పశు గ్రాసానికి రైతులు ఇబ్బందులు పడుతున్నారు. తాగునీటి కోసం లంక గ్రామాల ప్రజలు అవస్థలు పడుతున్నారు. వరద ఉధృతి వల్ల మురుగునీటి కాలువల్లో నీటి మట్టాలు పెరిగి, చేలల్లో ముంపు పెరగడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



పి.గన్నవరం మండలం బూరుగులంక రేవులో పడవపై వస్తున్న లంక గ్రామాల ప్రజలు

సఖినేటిపల్లి రేవు బంద్

గోదావరి నదీపాయ వశిష్ఠ ఉధృతంగా ఉండడంతో సఖినేటిపల్లి-నర్సాపురం రేవు ప్రయాణాన్ని అధికారులు రద్దు చేశారు. పంటు, పడవలపై రాకపోకలు నిలిపివేయడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బంది పడ్డారు. దీనిపై అధికారులు ముందస్తు సమాచారం అందించలేదు. దిండి-చించినాడ వంతెన మరమ్మతుల వల్ల నిలిపివేయడంతో రాజోలు దీవి ప్రయాణికులు రేవు ద్వారా ప్రయాణాలు సాగిస్తున్నారు. తాజాగా వంతెనపై మరమ్మతులు ఆపి ప్రయాణాలకు అనుమతి ఇచ్చినా.. ఈ సమాచారం తెలియక పలువురు రేవు వద్దకు వచ్చి వెనుదిరిగారు.

- గోదావరి ఉగ్రరూపం దాల్చడంతో జిల్లాలో పి.గన్నవరం మండలంలోని లంక గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వరద ప్రభావం ఈ మండలంపైనే అధికంగా ఉంది. మండలంలోని ఊడిమూడిలంక, జి.పెదపూడిలంక, అరిగెలవారిపేట, బూరుగులంక గ్రామాల ప్రజలు, విద్యార్థులు వరద ఉధృతిలో పడవలపై వస్తున్నారు. వరద పెరగడంతో ఇక్కడ వారిలో ఆందోళన పెరిగింది. వరద పెరుగుతుండంతో పడవలను ఆశ్రయిస్తున్న లంక గ్రామాల సంఖ్య పెరుగుతోంది. జిల్లాకు సరిహద్దులో ఉన్న పెదమల్లంక, ఆనగర్లంక, సిర్రావారిలంక, అయోధ్యలంక గ్రామాల ప్రజలు పడవలపై రాకపోకలు సాగిస్తున్నారు.
- ఐ.పోలవరం మండలంలో వరద ఉధృతి అధికంగా ఉంది. గౌతమీ, వృద్ధ గౌతమీలు ప్రమాదకర స్థితిలో సుడులు తిరుగుతూ ప్రవహిస్తోంది. అన్నంపల్లి అక్విడెక్టు సగం వరకు మునిగింది. అక్విడెక్టుకు ఇరువైపులా ఇటు పశువుల లంక, అటు ముమ్మిడివరం మండలం అన్నంపల్లి వైపు ఏటిగట్లు బలహీనంగా ఉండడంతో 2022 అతి పెద్ద వరదకు గండ్లు పడతాయని స్థానికులు ఆందోళన చెందిన విషయం తెలిసిందే. ఇప్పుడు వరద పెరుగుతుండడంతో వీరంతా మళ్లీ భయపడుతున్నారు. మండలంలో మురమళ్ల రాఘవేంద్ర వారధి వద్ద ఉన్న మత్స్యకార కాలనీ రాత్రికి ముంపు బారిన పడే అవకాశముంది. మురమళ్లలో వరద నీరు డ్రెయిన్ ద్వారా చొచ్చుకువచ్చి చేలను ముంచిన విషయం తెలిసిందే. వరదతో పాటు ముంపు ఇంకా పెరిగింది.
- కాట్రేనికోన మండలం నడవపల్లి గ్రామంలోకి వరద నీరు వస్తోంది. పల్లంకుర్రు రేవు నీట మునిగింది. మత్స్యకారుల ఇళ్ల వద్దకు నీరు చేరింది. శుక్రవారం నడవపల్లి, పల్లంకుర్రు రేవు, బలుసుతిప్పలు ముంపు బారిన పడే అవకాశముంది.
- అల్లవరం మండలం బోడసుకుర్రు పల్లెపాలెంలో వరద నీరు చేరుతోంది. ముంపు మరింత పెరిగే అవకాశముంది. వరద ఇదే విధంగా పెరిగితే లోతట్టు ప్రాంతవాసులను తరలించాల్సి ఉంటుంది.

ధవళేశ్వరం బ్యారేజీ నుంచి దిగువకు నదీ జలాల విడుదల ఇలా..	
సమయం	నీటి విడుదల (క్యూసెక్కుల్లో)
ఉదయం 5 గంటలు	9,62,647
ఉదయం 6 గంటలు	9,75,648
ఉదయం 8 గంటలు	10,03,628
ఉదయం 10 గంటలకు	10,30,897
మధ్యాహ్నం 12 గంటలు	10,62,599
మధ్యాహ్నం 3 గంటలు	11,05,741
సాయంత్రం 4 గంటలు	11,19,293
సాయంత్రం 5 గంటలు	11,38,091
సాయంత్రం 6 గంటలు	11,51,758
సాయంత్రం 7 గంటలు	11,65,473
రాత్రి 8 గంటలు	11,85,026

ముంపులో కాజ్‌వేలు

గోదావరి మధ్యనున్న పలు లంక గ్రామాలకు స్థానికులు రాకపోకలు సాగించేందుకు వీలుగా పలుచోట్ల కాజ్‌వేల నిర్మాణం జరిగింది. ధవళేశ్వరం బ్యారేజీ వద్ద తొలి ప్రమాదకర హెచ్చరిక స్థాయిలో వరద వస్తే కొన్ని.. రెండో ప్రమాద హెచ్చరిక స్థాయిలో వరద వస్తే మరికొన్ని కాజ్‌వేలు నీట మునుగుతాయి. దీంతో వీటిపై ట్రాక్టర్లు, పడవలు ఏర్పాటు చేసి లంకవాసుల రాకపోకలకు ఏర్పాట్లు చేస్తుంటారు.

- పి.గన్నవరం మండలం చాకలిపాలెం శివారు కనకాయలంక కాజ్‌వేపై వరద ఉధృతంగా ప్రవహిస్తున్న నేపథ్యంలో ఆ గ్రామ ప్రజలు పడవలపై వెళ్తున్నారు. వరద మరింత పెరిగితే జి.పెదపూడిలంక ఏటిగట్టును ఆనుకుని ఉండే కాజ్‌వే కూడా నీట మునుగుతుంది.
- అయినవిల్లి మండలం ముక్తేశ్వరం ఎదురుబిడియం వద్ద ముక్తేశ్వరం రేవుకు వెళ్లే కాజ్‌వేపై వరద నీరు చేరింది. ప్రస్తుతం వాహనాలు వెళుతున్నా, వరద పెరిగితే శుక్రవారం నుంచి పడవలు ఏర్పాటు చేసేందుకు అధికారులు సిద్ధమవుతున్నారు. దీనివల్ల వీరవల్లిపాలెం, కపిలేశ్వరపురం మండలం పరిధిలోని అద్దంకివారిలంకకు వెళ్లే ప్రయాణికులకు ఇబ్బందులు తప్పవు.
- మామిడికుదురు మండలం అప్పనపల్లి కాజ్‌వేను ఆనుకుని వరద నీరు ప్రవహిస్తోంది. రాత్రికి కాజ్‌వేపై వరద నీరు చేరనుంది. రెండో ప్రమాద హెచ్చరికకు వరద వస్తున్నందున.. ఇక్కడ ట్రాక్టర్లు, పడవలు ఏర్పాటు చేయాల్సి వస్తోంది. కాజ్‌వేపై నీరు చేరితే అప్పనపల్లి, బి.దొడ్డవరం, పెదపట్నం లంక వాసులకు ఇబ్బందులు తప్పవు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

కలెక్టర్ మహేష్‌కుమార్



పాశర్లపూడిలో వరద పరిస్థితిని సమీక్షిస్తున్న కలెక్టర్ మహేష్‌కుమార్

మామిడికుదురు: గోదావరి వరద దృష్ట్యా నదీ పరివాహక ప్రాంతాల్లోని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ హెచ్చరించారు. గురువారం ఆయన అప్పనపల్లి కాజ్‌వే వద్ద వరద ఉధృతిని పరిశీలించారు. వరద ఉధృతి మరింత పెరిగే అవకాశం ఉందని, అధికారుల హెచ్చరికలకు అనుగుణంగా ప్రజలు సురక్షిత ప్రాంతాలకు చేరుకోవాలన్నారు. సహాయక చర్యలకు అధికారులు సన్నద్ధంగా ఉండాలని నిర్దేశించారు. వరద ఉధృతి పెరిగే పక్షంలో కొన్ని ప్రాంతాల్లో రోడ్లు ముంపు బారిన పడి, రాకపోకలకు అంతరాయం కలిగే అవకాశం ఉందన్నారు. అత్యవసర పరిస్థితుల్లో మాత్రమే ప్రజలు బయటకు రావాలన్నారు. ముంపు బాధితుల తరలింపు, పునరావాస కేంద్రాల నిర్వహణపై అధికారులు దృష్టి సారించాలన్నారు. ముంపునకు గురయ్యే ప్రాంతాల్లో ప్రజల్ని సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు అధికారులు సన్నద్ధం కావాలని సూచించారు. ఆయన వెంట మండల ప్రత్యేకాధికారి వేణుగోపాల్, తహసీల్దార్ పి.సునీల్‌కుమార్, ఇన్‌చార్జి ఎంపీడీఓ అడబాల శ్రీనివాస్, ఇతర అధికారులు ఉన్నారు.

శాస్త్రోక్తంగా లక్ష రుద్రాక్ష పూజ

ఐ.పోలవరం: నిత్య కల్యాణం పచ్చతోరణంగా విరాజిల్లుతున్న మురమళ్ల భద్రకాళీ సమేత వీరేశ్వర స్వామివారికి గురువారం లక్ష రుద్రాక్ష పూజా మహోత్సవం అత్యంత శాస్త్రోక్తంగా జరిగింది. శ్రావణ మాసం మాస శివరాత్రి మహా పర్వదినాన్ని పురస్కరించుకుని ఆలయ అర్చకులు యనమండ్ర సత్య సీతారామ శర్మ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. 15 మంది రుత్విక్‌లు కార్యక్రమంలో పాల్గొన్నారు. వారణాసి నుంచి తెచ్చిన రుద్రాక్షలను మేళతాళాలతో గ్రామోత్సవం జరిపి, గోదావరి వద్ద ప్రత్యేక పూజలు, సంప్రోక్షణ చేశారు. 728 మంది భక్తులు గోత్ర నామాలు నమోదు చేసుకున్నారు. ఆలయ సహాయ కమిషనర్, కార్యనిర్వాహణాధికారి వి.సత్యనారాయణ ఏర్పాట్లను పర్యవేక్షించారు. అధిక సంఖ్యలో పాల్గొన్న భక్తులకు అల్పాహారం, అన్నప్రసాద వితరణ ఏర్పాటు చేశారు. కార్యక్రమం తిలకించేందుకు భారీ ఎల్ఈడీ స్క్రీన్ ఏర్పాటు చేశారు. భక్తులకు రుద్రాక్షలు ప్రసాదంగా అందజేశారు.



ప్రత్యేక అలంకరణలో వీరేశ్వరస్వామి

నమ్మబలికి..

గత ప్రభుత్వ వెన్నుదన్నుతో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించుకుని.. సమాజంలో తమకంటూ ప్రత్యేక గౌరవాన్ని సాధించిన దివ్యాంగులకూ కూటమి ప్రభుత్వ వంచన ఎదుర్కొనక తప్పడం లేదు. దివ్యాంగులను అందలం ఎక్కిస్తామంటూ సార్వత్రిక ఎన్నికలకు ముందు కూటమి 'పెద్దలు' అరచేతిలో వైకుంఠం చూపించి నమ్మబలికారు. తీరా అధికారం చేపట్టాక.. ఒక్కొక్క సంక్షేమ పథకాన్నీ నిర్వీర్యం చేస్తున్న ప్రభుత్వం.. తాజాగా దివ్యాంగుల పింఛన్లపై కన్నేసింది.

- దివ్యాంగులకు కూటమి సర్కార్ వంచన
- పరిశీలన పేరుతో వారి పింఛన్లకు కత్తెర
- జీవనోపాధి కోల్పోయిన అనేక మంది
- జిల్లావ్యాప్తంగా 2,899 మందికి నిలుపుదల
- ప్రభుత్వానికి బాధితుల శాపనార్థాలు

రాజోలు: ప్రభుత్వం ద్వారా ప్రతి నెలా వచ్చే పింఛను సొమ్ముతో పోషణకు విఘాతం లేకుండా ఆత్మగౌరవంతో జీవనం సాగిస్తున్న దివ్యాంగులపై కూటమి ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలకు తెరతీసింది. దివ్యాంగుల పింఛన్ల పరిశీలన పేరుతో కూటమి ప్రభుత్వం.. అధిక సంఖ్యలో వారి పింఛన్లకు కత్తెర వేసింది. తమ పింఛను ఆగిపోయిందని తెలిసిన దివ్యాంగులు సచివాలయం, మండల పరిషత్ కార్యాలయాలకు చేరుకుని కంటతడి పెట్టుకుంటున్నారు. తమ పింఛను తొలగించవద్దంటూ అధికారులను ప్రాధేయపడుతున్నారు. వైకల్యం, కంటిచూపు, వినికిడి, వివిధ రకాల మానసిక రుగ్మతలతో అనేక మంది దివ్యాంగులు ప్రతి నెలా పింఛను అందుకుంటున్నారు. ఈ డబ్బే వారికి పూర్తి జీవనాధారం. అంతేకాకుండా కుటుంబ పోషణకు చేతనైన సాయం వారు అందిస్తున్నారు. పింఛను రద్దుతో కుటుంబంలో తమపై చీదరింపులు, ఛీత్కారాలు తప్పవని దివ్యాంగులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. పదేళ్లకు పైబడి అంగవైకల్య ధ్రువీకరణ పత్రంతో పింఛను అందుకుంటున్న అనేక మందికి.. పరిశీలన పేరుతో వైకల్య శాతం తగ్గించి పింఛన్లు నిలిపివేశారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఏనాడూ, ఎలాంటి ఇబ్బందులు లేకుండా పింఛను అందుకునే వారమని ఈ సందర్భంగా పలువురు దివ్యాంగులు గుర్తు చేసుకుంటున్నారు.

శాపంగా మారిన పునః పరిశీలన

కూటమి ప్రభుత్వం లేనిపోని నిబంధనలతో దివ్యాంగుల పింఛన్లను తగ్గించేందుకు పునః పరిశీలన పేరుతో సదరం సర్టిఫికెట్ల తనిఖీని ప్రభుత్వాస్పత్రుల్లో ప్రత్యేక వైద్య బృందాల పేరుతో నిర్వహించారు. గతంలో ముగ్గురు సభ్యుల వైద్యుల బృందం ఇచ్చిన సదరం సర్టిఫికెట్‌లో అంగ వైకల్యం శాతాన్ని ఇప్పుడు తగ్గించేశారు. 90 శాతం ఉంటే 56 శాతానికి, 55 ఉంటే 44కు, 44 ఉంటే 35 శాతానికి కుదించారు. దీంతో అనేక మంది దివ్యాంగుల అంగ వైకల్యం 40 శాతానికి తగ్గిపోవడంతో పింఛన్లు పొందేందుకు అనర్హులుగా కూటమి ప్రభుత్వం ప్రకటించింది. వైకల్య శాతం తగ్గించిన కారణంగా పింఛనుతో పాటూ, కొన్ని రాయితీలు, ఉద్యోగ రిజర్వేషన్లలో అనేక మంది దివ్యాంగులు తీవ్రంగా నష్టపోయే పరిస్థితులు ఉత్పన్నమయ్యాయి.

సెప్టెంబర్ నుంచి నిలుపుదల

పునఃపరిశీలనలో అంగవైకల్యం 40 శాతం కంటే తక్కువగా గుర్తించిన వారికి ఈ ఏడాది సెప్టెంబర్ నుంచి పింఛను నిలుపుదల చేస్తున్నట్టు ఇప్పటికే జిల్లా గ్రామీణాభివృద్ధిశాఖ అధికారులు వెల్లడించారు. పింఛను కోల్పోయిన దివ్యాంగులు ఎంపీడీఓ, మున్సిపల్ కమిషనర్లకు 30 రోజుల్లోగా అప్పీళ్లు చేసుకుంటే, మళ్లీ వైద్య పరీక్షలకు సిఫార్సు చేసి పింఛను మంజూరు చేస్తామంటున్నారు. జిల్లావ్యాప్తంగా 32,101 మంది దివ్యాంగులు పింఛన్లు పొందుతున్నారు. కదల్లేని స్థితిలో 16,934 మంది ఉండగా, దృష్టి లోపం 4,036 మంది, వినికిడి లోపం 3,992 మంది కాగా, మానసిక వైకల్యం 3,751 మంది. మానసిక అనారోగ్యం 1,277 మంది ఉండగా, వివిధ బహుళ వైకల్యం 2,111 మంది వరకున్నారు. ఇటీవల వచ్చిన ఆరోపణల నేపథ్యంలో వీరి గుర్తింపుపై సర్వే నిర్వహించారు. ఇంతవరకు 24,213 మంది పింఛన్ల పునః పరిశీలన పూర్తయింది. ఇంకా 7,888 మంది దివ్యాంగుల పింఛన్లను పరిశీలించాల్సి ఉంది. ఇప్పటివరకు 2,899 మంది పింఛన్లను నిలుపుదల చేశారు. అలాగే అంగవైకల్యం 40 శాతం కంటే తక్కువగా ఉన్న 652 మందిలో 60 ఏళ్లు దాటిన వారికి వృద్ధాప్య, భర్త చనిపోయిన దివ్యాంగ మహిళలకు వితంతు పింఛన్లుగా మార్పు చేసి, గతంలో పొందిన రూ.6 వేల పింఛనును రూ.4 వేలకు కుదించారు. పూర్తిగా మంచానికే పరిమితమైన దివ్యాంగులకు రూ.15 వేలు అందిస్తున్న పింఛనును వైకల్య శాతం కుదించి రూ.6 వేలు, రూ.4 వేలకు మార్పు చేశారు. దీంతో ప్రతి నెలా రూ.15 వేలు అందుకుంటున్న వారు రూ.6 వేలు, రూ.4 వేలతో సరిపెట్టుకోవాల్సి వస్తోంది. వీరిలో 60 ఏళ్లు దాటిన వారికి కంటి తుడుపు చర్యగా 321 మందికి వృద్ధాప్య, వితంతు పింఛన్లు అందజేస్తున్నట్టు అధికారులు తెలిపారు.



పింఛను పునః పరిశీలన కోసం రాజోలు ఆస్పత్రికి వచ్చిన దివ్యాంగురాలు

పింఛను డబ్బులే ఆధారం



ఎప్పట్నుంచో పింఛను తీసుకుంటున్నాను. చిన్నతనం నుంచి మానసిక వైకల్యంతో ఉన్నాను. నాకు వివాహమైంది. ఇద్దరు ఆడ పిల్లలు. నా భర్త నన్ను విడిచిపెట్టి వెళ్లిపోయాడు. పింఛను సొమ్మే నా కుటుంబానికి జీవనాధారం. కూలీ పని కూడా చేయలేను. గతంలో ఎన్నడూ ఇలా జరగలేదు. పింఛను ఇచ్చి నన్ను, నా కుటుంబాన్ని ఆదుకోండి.

– నక్కా రాణి, మానసిక దివ్యాంగురాలు, కూనవరం, రాజోలు మండలం

కుడి కన్ను చూపు పోయింది



కంటి జబ్బు కారణంగా కుడి కన్ను చూపు పూర్తిగా పోయింది. ఎడమ కన్ను సరిగ్గా కనిపించడం లేదు. ఎలాంటి పనులు చేయలేకపోతున్నాను. ఎవరూ పనులు చెప్పడం లేదు. గత ప్రభుత్వ హయాంలో నాకు దివ్యాంగ పింఛను మంజూరు చేశారు. అప్పటి నుంచి ఈ పింఛను డబ్బు పైనే ఆధారపడి జీవిస్తున్నాను. పింఛను పునరుద్ధరించి న్యాయం చేయండి.

– ఎమ్మిలి తాతబ్బాయి, సోంపల్లి, రాజోలు మండలం

దివ్యాంగులపై కూటమి ప్రభుత్వ కక్ష



అనర్హుల ఏరివేత పేరుతో దివ్యాంగులపై కూటమి ప్రభుత్వం కక్ష కట్టింది. అర్హులైన దివ్యాంగులు వేల మందిని రాష్ట్రవ్యాప్తంగా తొలగించింది. ఓవైపు పింఛన్లు పెంచి, మరోవైపు తొలగించి దివ్యాంగ కుటుంబాలను రోడ్డున పడేయడం న్యాయం కాదు. పింఛను ఒక్కటే కాదు, రాబోయే రోజుల్లో ఉపాధి, సంక్షేమ, ఉద్యోగావకాశాలూ దివ్యాంగులు కోల్పోవచ్చు.

– ఖండవిల్లి భరత్‌కుమార్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, అఖిల భారత దివ్యాంగుల హక్కుల వేదిక

అంబాజీపేట కొబ్బరి మార్కెట్



కొబ్బరి రకం	ధర (రూ.ల్లో)
కొత్తకొబ్బరి (క్వింటాల్)	20,000 – 21,500
కొత్తకొబ్బరి (రెండో రకం)	10,500 – 12,000
కురిడీ కొబ్బరి (పాతవి)	
గండేరా (వెయ్యి)	29,000
గటగట (వెయ్యి)	27,000
కురిడీ కొబ్బరి (కొత్తవి)	
గండేరా (వెయ్యి)	28,000
గటగట (వెయ్యి)	26,000
నీటికాయ, పాత (ముక్కుడు)కాయ (వెయ్యి)	19,000 – 20,000
కొత్త (పచ్చి)కాయ (వెయ్యి)	18,000 – 19,000
కొబ్బరి నూనె (15 కిలోలు)	5,250
కిలో	350

క్లుప్తంగా

తల్లిదండ్రులకు యువతి అప్పగింత

గండేపల్లి: ఇంట్లో పెద్దలు పెళ్లి సంబంధాలు చూడడం ఇష్టంలేని యువతి మూడు రోజుల క్రితం అదృశ్యమైంది. దీనిపై ఫిర్యాదు అందుకున్న పోలీసులు చురుగ్గా దర్యాప్తు చేసి.. ఎట్టకేలకు ఆమె ఆచూకీ కనుగొని కుటుంబ సభ్యులకు అప్పగించారు. సీఐ వైఆర్‌కే శ్రీనివాస్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఒడిశాకు చెందిన 19 ఏళ్ల యువతి రామేశంపేటలోని ఓ హాస్టల్‌లో ఉంటూ, సూరంపేటలోని ప్రైవేటు కళాశాలలో చదువుకుంటోంది. ఆమె తల్లిదండ్రులు ఒడిశాలోనే ఉంటున్నారు. ఇలాఉండగా ఇటీవల ఆమె ఇంట్లో పెళ్లి సంబంధాలు చూడడం మొదలు పెట్టారు. పెళ్లి ఇష్టం లేని ఆ యువతి మంగళవారం నుంచి అదృశ్యమైంది. విషయం తెలుసుకున్న ఆమె కుటుంబ సభ్యులు గండేపల్లి పోలీస్ స్టేషన్‌లో బుధవారం ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన ఎస్సై యూవీ శివనాగబాబు వెంటనే ప్రత్యేక బృందంతో గాలింపు చేపట్టారు. సాంకేతిక పరిజ్ఞానంతో హైదరాబాద్‌లోని దిల్‌సుఖ్‌నగర్ ప్రాంతంలో ఆమె ఉన్నట్టు గుర్తించారు. అక్కడకు పోలీసు బృందాన్ని పంపించి, ఆమెను గురువారం పోలీసు స్టేషన్‌కు తీసుకొచ్చారు. కౌన్సెలింగ్ ఇచ్చి ఆమెను కుటుంబ సభ్యులకు అప్పగించారు.

పేకాట శిబిరంపై పోలీసుల దాడి



స్వాధీనం చేసుకున్న బైకులు, నిందితులతో పోలీసులు

కోరుకొండ: శ్రీరంగపట్నం–కోరుకొండ మధ్య పేకాట శిబిరంపై గురువారం పోలీసులు దాడి చేశారు. ఎస్సై కూన నాగరాజు ఆధ్వర్యంలో సిబ్బంది దాడి చేసి, ఆరుగురిని అరెస్టు చేశారు. వారి నుంచి రూ.20,150 నగదు, ఆరు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసినట్టు ఎస్సై నాగరాజు తెలిపారు.

ఎట్టకేలకు డిగ్రీ అడ్మిషన్లకు నోటిఫికేషన్

- రిజర్వేషన్లు, రోస్టర్ పాయింట్ల వారీగా సీట్ల కేటాయింపు
- ఆన్‌లైన్‌లో అభ్యర్థుల రిజిస్ట్రేషన్‌కు ఈ నెల 26వ తేదీ తుది గడువు
- వచ్చే నెల ఒకటి నుంచి తరగతులు ప్రారంభం
- ఈ ఏడాది నుంచి నూతన విద్యా విధానం



కొత్తపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల

రాయవరం: ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేట్ డిగ్రీ కళాశాలల్లో ప్రవేశాలకు ఆన్‌లైన్ దరఖాస్తుల ప్రక్రియ ప్రారంభమైంది. రాష్ట్ర ప్రభుత్వం 2025–26 విద్యా సంవత్సరానికి డిగ్రీ కోర్సుల్లో ప్రవేశాలకు బుధవారం నోటిఫికేషన్ విడుదల చేసింది. గతేడాది మాదిరిగానే ఈ ఏడాది కూడా ఆన్‌లైన్ విధానంలో డిగ్రీ అడ్మిషన్లు నిర్వహించనున్నారు. ఇంటర్ ఉత్తీర్ణులైన విద్యార్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. ఆదికవి నన్నయ యూనివర్సిటీ పరిధిలోని ఉమ్మడి జిల్లాలో ఉన్న కళాశాలల్లో గతేడాది సుమారు 32 వేల సీట్లు భర్తీ అయ్యాయి. కోనసీమ జిల్లా విషయానికొస్తే.. రామచంద్రపురం, మండపేట, రావులపాలెం, ముమ్మిడివరం, రాజోలు, కొత్తపేట, ఆలమూరుల్లో డిగ్రీ కళాశాలలున్నాయి. ఇందులో సైన్స్, ఆర్ట్స్, కామర్స్, ఒకేషనల్ కోర్సుల్లో సుమారు 2,800 వరకు సీట్ల భర్తీకి అవకాశముంది.

షెడ్యూల్

విద్యార్థులు ఈ నెల 20 నుంచి 26వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో పేర్లను రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. 25 నుంచి 28వ తేదీ వరకు స్పెషల్ కేటగిరీ వెరిఫికేషన్ ఉంటుంది. ఫిజికల్లీ ఛాలెంజ్డ్/సీఏపీ/ఎక్స్‌ట్రా కరిక్యులర్ యాక్టవిటీస్/ఎన్‌సీసీ/గేమ్స్ అండ్ స్పోర్ట్స్ వంటి స్పెషల్ కేటగిరీ వెరిఫికేషన్లు ఆయా యూనివర్సిటీల్లో ప్రాంతాల వారీగా నిర్వహిస్తారు. కోర్సులను ఎంపిక చేసుకోవడం కోసం ఈ నెల 24 నుంచి 28వ తేదీ వరకు వెబ్ ఆప్షన్లకు అవకాశం ఇస్తారు. వెబ్ ఆప్షన్ల మార్పునకు ఈ నెల 29న అవకాశం కల్పించారు. ఈ నెల 31న సీట్ల అలాట్‌మెంట్, వచ్చే నెల ఒకటి నుంచి తరగతులు ప్రారంభం కానున్నాయి.

డిగ్రీ కళాశాలలు

జిల్లా	ప్రభుత్వ	ప్రైవేట్	అటానమస్
కోనసీమ	07	45	01
తూర్పుగోదావరి	06	40	01
కాకినాడ	05	46	03

మూడే డిగ్రీ కోర్సులు

జాతీయ విద్యా విధానం–2020 నిబంధనలను అనుసరించి ఏపీ ఉన్నత విద్యా మండలి 2023 నుంచి నాలుగేళ్ల డిగ్రీ ఆనర్స్ కోర్సులు ప్రవేశపెట్టారు. సంప్రదాయక మూడేళ్ల డిగ్రీ కోర్సుల స్థానంలో నాలుగేళ్ల డిగ్రీ ఆనర్స్ కోర్సులు అమలు చేస్తున్నప్పటికీ, కొన్ని ప్రత్యేక కళాశాలల్లోనే నాలుగేళ్ల డిగ్రీ ఆఫర్ చేస్తున్నారు. మెజార్టీ కళాశాలల్లో మాత్రం మూడేళ్ల డిగ్రీ కోర్సులున్నాయి. నాలుగేళ్ల కోర్సుల్లో గతంలో మాదిరిగా మూడు మేజర్ సబ్జెక్టులు కాకుండా ఒక్కటే ఉంటుంది. దీనిని సింగిల్ మేజర్ డిగ్రీ కోర్సుగా పిలుస్తారు. ఉదాహరణకు గతంలో బోటనీ, జువాలజీ, కెమిస్ట్రీ మేజర్ సబ్జెక్టులుగా బీఎస్సీ చదువుకునే విద్యార్థి.. సింగిల్ మేజర్ సబ్జెక్టు విధానంలో బీఎస్సీ బోటనీ, జువాలజీ, కెమిస్ట్రీల్లో ఏదో ఒక సబ్జెక్టును ఎంచుకుని, తనకు నచ్చిన వేరే సబ్జెక్టును మైనర్ సబ్జెక్టుగా ఎంచుకుంటాడు. ఇంటర్‌లో ఆర్ట్స్, సైన్స్ సబ్జెక్టులతో సంబంధం లేకుండా, ఏ సబ్జెక్టునైనా మైనర్ సబ్జెక్టుగా ఎంచుకోవచ్చు. డిగ్రీ ఫస్టియర్ చదివి మానేసినప్పటికీ సర్టిఫికెట్ కోర్సు అని ధ్రువపత్రం ఇస్తారు. రెండేళ్లయితే డిప్లొమా సర్టిఫికెట్, మూడేళ్లయితే డిగ్రీ సర్టిఫికెట్, నాలుగేళ్లు చదివితే డిగ్రీ ఆనర్ సర్టిఫికెట్‌ను అందజేస్తారు. డిగ్రీ నాలుగేళ్లలో ఎప్పుడైనా మధ్యలో చదువు మానేసే వెసులుబాటు ఉంది. దానికి అనుగుణంగానే సర్టిఫికెట్లు అందజేస్తారు. ఫస్టియర్ నుంచి నాలుగేళ్ల లోపు ఏ దశలో చదువు మానేసినా, ఏడేళ్ల లోపు తిరిగి ప్రవేశం పొంది, విద్యాభ్యాసం కొనసాగించే అవకాశం ఉంది. డిగ్రీ విద్యా విధానంలో ప్రవేశ పెట్టిన నూతన సింగిల్ మేజర్ ఆనర్స్ డిగ్రీ పద్ధతిపై ఇంటర్మీడియెట్ విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు అవగాహన కలిగించాల్సిన అవసరం ఉంది. ఈ విద్యా సంవత్సరం నుంచే నూతన విద్యా విధానం అమలవుతుంది.

సీట్ల కేటాయింపు ఇలా..

గతంలో డిగ్రీ అడ్మిషన్స్ రూల్ ఆఫ్ రిజర్వేషన్ వారీగా నిర్వహించే వారు కాదు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి డిగ్రీ కోర్సుల్లో 50 శాతం రిజర్వేషన్లు తప్పనిసరి చేశారు. ఇంటర్మీడియెట్‌లో కామర్స్ ఓ సబ్జెక్టుగా చదివిన వారికి మొత్తం బీకాం కోర్సులో 60 శాతం సీట్లు కేటాయిస్తారు. అలాగే ఆర్ట్స్, హ్యుమానిటీస్‌లో ఇంటర్ పూర్తి చేసిన వారికి మొత్తం బీఏ సీట్లలో 50 శాతం, తక్కిన 50 శాతం ఇంటర్‌లో సైన్స్ గ్రూపు పూర్తి చేసిన వారికి కేటాయిస్తారు. ఆదికవి నన్నయ యూనివర్సిటీ(అక్ను) పరిధిలో ఉన్న డిగ్రీ కళాశాలల్లో బీఏ, బీకామ్, బీఎస్సీ సాధారణ కోర్సులతో పాటు, కంప్యూటర్, మార్కెట్ ఓరియంటెడ్, స్కిల్ ఓరియంటెడ్, ఒకేషనల్ కోర్సుల్లో ప్రవేశానికి విద్యార్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. విద్యార్థులు aprche.gov.in వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్ విధానంలో దరఖాస్తు చేయాలి. సమీపంలో ఉన్న డిగ్రీ కళాశాలకు వెళ్లి రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు. సాధారణ కోర్సులకు రూ.3 వేల వరకు, కంప్యూటర్ కోర్సులకు రూ.8 వేల నుంచి రూ.10 వేల వరకు ఫీజు ఉంటుంది.

సద్వినియోగం చేసుకోవాలి



డిగ్రీ కళాశాలల్లో అడ్మిషన్లు ప్రారంభమయ్యాయి. ఇంటర్ ఉత్తీర్ణులైన విద్యార్థులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. తక్కువ ఫీజులతో, అన్ని రకాల సౌకర్యాలతో డిగ్రీ చదువుకునే వెసులుబాటు ఉంది. పేద, మధ్య తరగతి విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ సదుపాయం అందుబాటులో ఉంది. క్యాంపస్ ప్లేస్‌మెంట్లలో అత్యధికంగా ఎంపికవుతున్నారు.

– డాక్టర్ సీహెచ్ రామకృష్ణ, ప్రిన్సిపాల్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, రామచంద్రపురం

అత్యున్నత ప్రమాణాలతో..



నాడు–నేడు పథకం ద్వారా డిగ్రీ కళాశాలల్లో మౌలిక సదుపాయాలు సమకూరాయి. అత్యున్నత ప్రమాణాలతో డిగ్రీ కళాశాలల్లో తరగతి విద్యా బోధన జరుగుతుంది. అన్ని కళాశాలల్లో జవహర్ నాలెడ్జ్ సెంటర్, ప్లేస్‌మెంట్ సెల్స్ ఉన్నాయి. ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో ప్రవేశాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి.

– డాక్టర్ కేపీ రాజు, ప్రిన్సిపాల్, వీకేవీ డిగ్రీ కళాశాల, కొత్తపేట, కోనసీమ జిల్లా

సత్యదేవుని దర్శించిన మాజీ మంత్రి రోజా, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి



సత్యదేవుని వ్రతాలాచరిస్తున్న రోజా దంపతులు, కల్యాణి దంపతులు

అన్నవరం: వైఎస్సార్ సీపీ నాయకురాలు, మాజీ మంత్రి ఆర్‌కే రోజా, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి కుటుంబ సమేతంగా గురువారం రత్నగిరిలో సత్యదేవుని దర్శనం చేసుకున్నారు. తొలుత రోజా దంపతులు, కల్యాణి దంపతులు సత్యదేవుని వ్రతాలాచరించారు. అనంతరం స్వామివారిని అంతరాలయంలో దర్శించి, పూజలు చేశారు. వారికి వేద పండితులు వేదాశీస్సులు అందజేయగా, సత్యదేవుని ప్రసాదాలను ప్రొటోకాల్ గుమస్తా గణపతి అందజేశారు. వారి వెంట పార్టీ నాయకుడు, అన్నవరం దేవస్థానం ట్రస్ట్ బోర్డు మాజీ సభ్యుడు వాసిరెడ్డి జగన్నాథం(జమీలు) ఉన్నారు. కాగా, స్వామివారి ఆలయానికి దర్శనం కోసం వచ్చినందున మీడియాతో మాట్లాడేందుకు రోజా, కల్యాణి ఇష్టపడలేదు.

ఇల్లు లేకుండా ఇంటి పన్ను

ఫిర్యాదుపై విచారణ చేసిన డీఎల్పీవో

కాకినాడ రూరల్: యు.కొత్తపల్లి మండలం నాగులాపల్లి గ్రామానికి చెందిన కూనిశెట్టి అచ్చామణికి ఇల్లు లేకుండానే ఇంటి పన్ను విధించారనే ఫిర్యాదుపై డీపీఓ ఆదేశాల మేరకు కాకినాడ డీఎల్పీవో పి.వాసుదేవరావు గురువారం విచారణ నిర్వహించారు. రమణయ్యపేట ఎంపీడీఓ కార్యాలయం పక్కన ఉన్న డీఎల్పీవో కార్యాలయంలో అచ్చామణి, అధికారుల నుంచి వివరాలు సేకరించారు. ఇల్లు లేకుండా పన్ను వేశారని పంచాయతీ కార్యదర్శిపై ఫిర్యాదు చేయడంతో విచారణ చేసి, వివరాలు సేకరించామని, పంచాయతీ కార్యదర్శి మెడికల్ లీవ్‌లో ఉండడంతో హాజరు కాలేదన్నారు. ఈ సందర్భంగా అచ్చామణి మీడియాతో మాట్లాడుతూ, 2021లో పంచాయతీ ఎన్నికల్లో సర్పంచ్ అభ్యర్థినిగా పోటీ చేసేందుకు నామినేషన్ దాఖలు చేయగా, ఇంటి పన్ను బకాయి ఉన్నట్టు ఫేక్ రసీదు సృష్టించి నామినేషన్ తిరస్కరించారని ఆరోపించారు. నాలుగేళ్లుగా చర్యలు తీసుకోకుండా, విచారణ పేరిట కాలక్షేపం చేస్తున్నారని ఆమె వెంట వచ్చిన నాయకులు ఆరోపించారు.

రైతు సమస్యలపై నిరంతర పోరాటం

- పదవి ఇచ్చిన వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌కు కృతజ్ఞతలు
- పార్టీ రైతు విభాగం రాష్ట్ర అధ్యక్షుడు జిన్నూరి బాబి



సాక్షి, అమలాపురం: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వ రైతు వ్యతిరేక విధానాల వల్ల పలు సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని, వాటి పరిష్కారానికి రైతులతో కలిసి పోరాటం చేస్తామని వైఎస్సార్ సీపీ రైతు విభాగం రాష్ట్ర అధ్యక్షుడు జిన్నూరి రామారావు (బాబి) తెలిపారు. పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇటీవల ఆయనను రైతు విభాగం రాష్ట్ర అధ్యక్షుడిగా నియమించిన విషయం తెలిసిందే. అమలాపురంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, మాజీ సీఎం జగన్, పార్టీ రాష్ట్ర కో–ఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ అధినేతకు, రైతులకు మధ్య అనుసంధానంగా ఉంటానన్నారు. తనపై నమ్మకం ఉంచిన పార్టీ అధినేత జగన్ ఆశయాలకు అనుగుణంగా పార్టీ ఉన్నతికి కృషి చేస్తానన్నారు. వైఎస్సార్ సీపీ తొలి నుంచీ రైతులకు మద్దతుగా పలు ఆందోళన కార్యక్రమాలు నిర్వహించిందన్నారు. అలాగే పార్టీ అధికారంలో ఉన్నప్పుడు రైతు సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని ఎన్నో కార్యక్రమాలు అమలు చేసిందన్నారు. వైఎస్సార్ రైతు భరోసా పేరున ప్రతి రైతుకు ఏడాదికి రూ.13,500 ఐదేళ్ల క్రమం తప్పకుండా అందించిందని గుర్తు చేశారు. రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేశారని, ఉచిత పంటల బీమా అమల్లోకి తెచ్చారని, పంట నష్టపోయిన మూడు నెలలకే పరిహారం అందించారని గుర్తు చేశారు. పార్టీ రైతు విభాగం అధ్యక్షునిగా, రాష్ట్ర అగ్రికల్చర్ మిషన్ వైస్ చైర్మన్‌గా ఎంవీఎస్ నాగిరెడ్డి రైతులకు ఎన్నో సేవలు అందించారని, ఆయన బాటలోనే పనిచేస్తామన్నారు.

గిరిజన విజ్ఞాన పరిరక్షణ అవసరం



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఆచార్య ప్రసన్నశ్రీ



సాంస్కృతిక ప్రదర్శన ఇస్తున్న విద్యార్థులు

- నన్నయ యూనివర్సిటీ వీసీ ఆచార్య ప్రసన్నశ్రీ
- గిరిజన ప్రాచీన విజ్ఞాన పరిరక్షణ సదస్సు

రాజానగరం: భావితరాలకు గిరిజన విజ్ఞానాన్ని పరిరక్షించి అందించాల్సిన బాధ్యత అందరిపై ఉందని ఆదికవి నన్నయ యూనివర్సిటీ వీసీ ఆచార్య ఎస్.ప్రసన్నశ్రీ అన్నారు. యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో గిరిజన ప్రాచీన విజ్ఞాన పరిరక్షణ, భవిషత్ తరాలకు చేర్చడం అనే అంశంపై రెండు రోజుల పాటు జరిగే అంతర్జాతీయ సదస్సు గురువారం ప్రారంభమైంది. గతాన్ని కాపాడుకోవడం ద్వారా భవిషత్తును శక్తిమంతంగా మార్చుకోవచ్చన్నారు. సమకాలీన సమాజంలో గిరిజన విజ్ఞాన వ్యవస్థలపై దృష్టి సారించడానికి ఈ సదస్సు దోహదపడుతుందన్నారు. శతాబ్దాలుగా సంస్కృతి, భాష, జ్ఞానాన్ని కలిగి ఉన్న గోదావరి తీరాన నిర్వహిస్తున్న ఈ సదస్సు గిరిజన నాగరికత గుర్తింపునకు పునాదిగా తోడ్పడుతుందన్నారు. గిరిజన సంస్కృతి, విజ్ఞాన సంపదను డాక్యుమెంటేషన్, డిజిటలైజేషన్ చేయాలన్నారు. ఈ సందర్భంగా నేషనల్ కమిషన్ ఫర్ షెడ్యూల్ ట్రైబ్స్ (న్యూఢిల్లీ) ముద్రించిన గిరిజన సమరయోధులు, గిరిజన హక్కుల చిత్రపటాలను, ఆంధ్ర వనవాసి కల్యాణాశ్రమ సహకారంతో ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్‌ను వీసీ ప్రారంభించారు. గిరిజన సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించేలా విద్యార్థులు, కళాకారులు ఇచ్చిన ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య కేవీ స్వామి, ప్రిన్సిపాల్ డాక్టర్ కె.సుబ్బారావు, కన్వీనర్ డాక్టర్ ఆర్ఎస్ వరహాలదొర, కో–కన్వీనర్లు డాక్టర్ ఎం.గోపాలకృష్ణ, డాక్టర్ ఎలీషాబాబు, డాక్టర్ కె.రాజామణి, డాక్టర్ వి.రామకృష్ణ, డాక్టర్ ఎస్.సుజాత, రాజేశ్వరీదేవి, సమన్వయకర్త డాక్టర్ సాంబశివరావు, కేంద్రీయ విద్యాలయం అధ్యాపకులు పాల్గొన్నారు.

భారీగా నల్ల బెల్లం స్వాధీనం

- ఇద్దరిపై కేసు నమోదు
- వ్యాన్ డ్రైవర్‌ను అరెస్టు చేసిన పోలీసులు



సీజ్ చేసిన వ్యాన్, సరకుతో ఎక్సైజ్ అధికారులు

ప్రత్తిపాడు: అక్రమంగా వ్యాన్‌లో తరలిస్తున్న నాలుగు వేల కిలోల నల్లబెల్లాన్ని జాతీయ రహదారిపై ప్రత్తిపాడు వద్ద గురువారం ఎక్సైజ్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరిపై కేసు నమోదు చేయగా, వ్యాన్ డ్రైవర్‌ను అరెస్టు చేశారు. ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఎం కృష్ణకుమారి వివరాల మేరకు, ఏలేశ్వరం మండలం యర్రవరం వద్ద జాతీయ రహదారిపై ఎక్సైజ్ పోలీసులు గస్తీ నిర్వహిస్తున్నారు. అనకాపల్లి నుంచి నల్లబెల్లం లోడుతో యర్రవరం వస్తున్న వ్యాన్‌ను తనిఖీ చేశారు. ఎటువంటి రసీదులు లేకుండా నల్లబెల్లం రవాణా చేస్తున్నట్టు గుర్తించారు. ఏలేశ్వరం మండలం లింగంపర్తి గ్రామానికి చెందిన వ్యాన్ డ్రైవర్ మనం నాగరాజును అరెస్టు చేసి, వ్యాన్‌తో పాటు, 4 వేల కిలోల నల్లబెల్లాన్ని సీజ్ చేశారు. ఏలేశ్వరం మండలం పెద్దనాపల్లి గ్రామానికి చెందిన బెల్లం వ్యాపారి శిలపరశెట్టి వెంకటరమణ అలియాస్ వెంకన్నబాబుపై కూడా కేసు నమోదు చేశారు. ఎస్టీఎఫ్ సూపరింటెండెంట్ దేవదత్తు, ఎక్సైజ్ సీఐ పి.శివప్రసాద్, ఎక్సైజ్ ఎస్సై పున్నం వంశీరామ్, సిబ్బంది పాల్గొన్నారు.

రెవెన్యూ శాఖలో ఉద్యోగులకు పదోన్నతి

అమలాపురం రూరల్: జిల్లాలో రెవెన్యూ శాఖ జూనియర్ అసిస్టెంట్లకు సీనియర్ అసిస్టెంట్లుగా పదోన్నతులు కల్పిస్తూ డీఆర్‌ఓ మాధవి గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. కాకినాడ జిల్లా కిర్లంపూడి తహసీల్దార్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్ త్రినాథ చంద్రశేఖర్‌కు సీనియర్ అసిస్టెంట్‌గా పదోన్నతి కల్పించి, అమలాపురం మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌గా నియమించారు. రామచంద్రపురం తహసీల్దార్ కార్యాలయ జూనియర్ అసిస్టెంట్ ఎల్.సూర్యకుమారి కొత్తపేట ఆర్డీవో కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా నియమితులయ్యారు. అల్లవరం తహసీల్దార్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్ జి.రామగణేష్‌ను అదే కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా నియమించారు. కాకినాడ ఏపీఎస్‌సీఎస్‌సీఎల్ జిల్లా మేనేజర్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్ ఎం.రాజన్‌బాబు రామచంద్రపురం ఆర్డీవో కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా నియమితులయ్యారు. ప్రత్తిపాడు తహసీల్దార్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్ ఎ.రాముడును అమలాపురం కలెక్టరేట్‌లో సీనియర్ అసిస్టెంట్‌గా నియమించారు.

కృత్రిమ కొరత సృష్టిస్తే చర్యలు

జిల్లా వ్యవసాయాధికారి బోసుబాబు



మండపేట గోడౌన్‌లో నిల్వలను పరిశీలిస్తున్న బోసుబాబు

కపిలేశ్వరపురం (మండపేట): ఎరువుల కృత్రిమ కొరతను సృష్టిస్తే చర్యలు తప్పవని జిల్లా వ్యవసాయాధికారి బోసుబాబు హెచ్చరించారు. మండపేటలో గురువారం ఆలమూరు సహాయ వ్యవసాయ సంచాలకుడు కేవీఎస్ చౌదరి, మండల వ్యవసాయాధికారి కె.ప్రభాకర్‌తో కలిసి ఎరువుల దుకాణాలను తనిఖీ చేశారు. మండపేటలోని లక్ష్మీ అపూర్వ ఏజెన్సీస్ గొడౌన్‌లోని నిల్వలు, రికార్డులను తనిఖీ చేసి, సంతృప్తి వ్యక్తం చేశారు. షాపుల ద్వారా ప్రతి బస్తాను ఈ–పాస్ ద్వారా విక్రయించాలని ఆదేశించారు. కొనుగోలు చేసిన రైతుకు కచ్చితంగా బిల్లు అందజేయాలన్నారు. ఎరువు విక్రయించిన సమయానికి, బిల్లు అందజేసిన సమయానికి పొంతన లేని పక్షంలో చట్ట పరిధిలో చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆయన వెంట మండల విస్తరణాధికారి బాలకృష్ణ, ఇతర సిబ్బంది ఉన్నారు.

విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్న ట్రాక్టర్

తొట్టెలో కూర్చున్న కూలీ మృతి



ట్రాక్టర్ తొట్టెపై పడి ఉన్న విద్యుత్ స్తంభం

గోకవరం: తిరుమలాయపాలెం–రంపయర్రంపాలెం గ్రామాల మధ్య విద్యుత్ స్తంభాన్ని ట్రాక్టర్ ఢీకొన్న ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. ఎస్సై పవన్ కుమార్ వివరాల మేరకు, తిరుమలాయపాలెంలో ఇటుకల లోడు దింపిన ట్రాక్టర్ ఐదుగురు కూలీలతో రంపయర్రంపాలెం వైపు బయలుదేరింది. డ్రైవర్ అజాగ్రత్తగా నడిపి, రోడ్డు పక్కనున్న విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టాడు. ఈ ఘటనలో స్తంభం విరిగి ట్రాక్టర్ తొట్టెపై పడటంతో, తొట్టెలో ఉన్న కూలీ కోరుకొండ మండలం కాపవరానికి చెందిన కొట్నాల శివ(36) అక్కడికక్కడే మృతి చెందాడు. ప్రమాద సమయంలో విద్యుత్ సరఫరా లేకపోవడంతో పెనుముప్పు తప్పింది. మిగిలిన నలుగురు కూలీలు సురక్షితంగా బయటపడ్డారు. డ్రైవర్‌పై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై పవన్‌కుమార్ తెలిపారు.

రక్తపింజరి హతం



స్థానికుల చేతిలో హతమైన రక్తపింజరి

సఖినేటిపల్లి: గ్రామంలోని మూడు తూములు సెంటర్ సమీపంలో ఏటి గట్టు దిగువన గురువారం గ్రామస్తుల చేతిలో రక్తపింజరి పాము హతమైంది. ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న వరద ప్రవాహానికి ఈ పాము కొట్టుకొచ్చిందని స్థానికులు చెబుతున్నారు.

రోడ్డు ప్రమాదంలో కళాకారుడి మృతి

అన్నవరం: జాతీయ రహదారిపై స్థానిక మండపం జంక్షన్ వద్ద గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో పెద్దాపురానికి చెందిన సంగీత కళాకారుడు ఎస్.ఆదినారాయణ(60) మృతి చెందారు. తేటగుంట తిమ్మాపురంలో బంధువుల ఇంటికి వచ్చిన ఆయన తిరుగు ప్రయాణంలో మోటార్ బైక్‌పై పెద్దాపురం వెళుతున్నారు. మండపం సెంటర్ వద్ద వేగంగా వచ్చిన గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో ఆయన అక్కడికక్కడే మృతి చెందారు. దీనిపై తమకు సమాచారం అందలేదని పోలీసులు తెలిపారు.

క్యాన్సర్‌ను ప్రాథమిక దశలో గుర్తించాలి



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో డాక్టర్ దుర్గారావు దొర

అమలాపురం టౌన్: క్యాన్సర్ లక్షణాలను ప్రాథమిక దశలోనే గుర్తిస్తే వ్యాధి నిర్ధారణ, నివారణ సామర్థ్యాలు బలోపేతమవుతాయని డీఎంహెచ్‌వో డాక్టర్ ఎం.దుర్గారావు దొర అన్నారు. జిల్లావ్యాప్తంగా క్యాన్సర్ లక్షణాలున్న వారిని ప్రాథమిక దశలోనే గుర్తించేందుకు చేపట్టిన శిక్షణ తరగతుల్లో భాగంగా స్థానిక ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో ప్రాథమిక, కమ్యూనిటీ ఆరోగ్య కేంద్రాల వైద్యులు, సిబ్బందికి గురువారం నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో డీఎంహెచ్‌వో మాట్లాడారు. గురువారం నుంచి వచ్చే నెల 15వ తేదీ వరకూ అసంక్రిత వ్యాధుల (ఎన్‌సీడీ) గుర్తింపుపై శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తామని చెప్పారు. ఈ శిక్షణ తరగతుల నోడల్ ఆఫీసర్ తిరుమలరావు, ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ఎం.సుమలత, జిల్లా ప్రభుత్వ ఆస్పత్రుల సమన్వయకర్త డాక్టర్ కార్తీక్ రెడ్డి, ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె.శంకరరావు, డాక్టర్ అనూష శిక్షణ కార్యక్రమంలో ప్రసంగించారు. కాన్సర్ కారకాలు, ప్రాథమిక దశలో గుర్తించడం వంటి అంశాలను వివరించారు.